క్లుప్తంగా

జేవీవీ మండల కమిటీ ఎన్నిక



వరికుంటపాడు: జనవిజ్ఞాన వేదిక మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన జన విజ్ఞాన వేదిక మండల సభలో మండల గౌరవాధ్యక్షులుగా ఎం సుబ్బారావు, వైవీ సుబ్బయ్య, మండలాధ్యక్షుడిగా ఎస్‌కే కరిముల్లా, ఉపాధ్యక్షులుగా ఎం ఆంజనేయులు, పీ రసూల్, ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణయ్య, కోశాధికారిగా టీ హజరత్తయ్య, సమన్వయకర్తలుగా టీ చెన్నకేశవులు, నాదెండ్ల రమణయ్యతో పాటు మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కాగా జేవీవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా కోశాధికారి పీ మాల్యాచలం ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. జేవీవీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. మూఢ నమ్మకాలను వీడి శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 468 బేళ్లను తీసుకురాగా, 346 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 122 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ. 200, సరాసరిన రూ.246.48 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు. వేలంలో పదహారు కంపెనీలు పాల్గొన్నాయి.

డీసీపల్లిలో 323 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 323 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 465 బేళ్లు రాగా, 323 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.245.41 ధర పలికిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



సంగం: హనుమజ్జయతిని పురస్కరించుకుని మండలంలోని దువ్వూరు, సంగం, జంగాలదొరువు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో ఆంజనేయస్వామి గ్రామోత్సవాలను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవాలు జరిపారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

ఉదయగిరి రూరల్: మండలంలోని పప్పులవారిపల్లెలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. మధ్యాహ్నం వసంతోత్సవం, పారువేటను నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. అలాగే ఆర్లపడియలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రికి సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న ఈడీ నిర్మలాదేవి

చేజర్ల(ఆత్మకూరు): ప్రభుత్వం మహిళల స్వయం ఉపాధి కోసం అందిస్తున్న ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి కోరారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలోని ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఎంపీడీఓ యశోదర, ఏపీఎం సుజనతో కలిసి కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలను అడిగి శిక్షణ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. 75శాతానికిపైగా హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా కుట్టుమెషిన్లు అందజేస్తామని ఆమె తెలిపారు.

ఉదయగిరి టీడీపీలో అసంతృప్తి జ్వాలలు

- ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారిన మండల కమిటీల నియామకం
- మండలాధ్యక్ష పదవుల కోసం ఆశావహులు పోటీ
- విధేయులకే పట్టం కట్టేందుకు కసరత్తు
- బొల్లినేని వర్గీయులను పూర్తిగా పక్కన పెట్టేందుకు యోచన
- కాకర్ల తీరుపై పలువురు నేతలు గుర్రు



ఉదయగిరి: ఉదయగిరి టీడీపీలో మండల కమిటీల నియామకాలు ఆ పార్టీలోని కొంతమందిలో అసంతృప్తి జ్వాలలు రగిలిస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉండడంతో మండలాధ్యక్ష పదవుల కోసం ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. దీంతో అధ్యక్షుల నియామకం ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావుకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో కొందరు పార్టీ మండలాధ్యక్షులతో పాటు పలువురు నాయకులు సైతం కాకర్ల సురేష్ విజయం కోసం పూర్తిస్థాయిలో సహకరించలేదు. దీంతో ఎన్నికల సమయంలో ఆయన కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. అయితే అధికార పార్టీ వ్యతిరేక పవనాలు బలంగా వీయడంతో స్వల్ప మెజార్టీతో కాకర్ల విజయం సాధించారు. దీంతో అప్పట్లోనే తనకు సహకరించని పార్టీ మండలాధ్యక్షులను పక్కన పెట్టాలని కాకర్ల వర్గీయులు ఎమ్మెల్యేపై తీవ్రఒత్తిడి తెచ్చారు. అయితే ఎమ్మెల్యే తొందరపడకుండా పార్టీ సంస్థాగత ఎన్నికల వరకు వేచి చూశారు. ప్రస్తుతం మండల కమిటీల్లో ఉన్న బొల్లినేని నియమించిన వారిని తొలగించి, తన మద్దతుదారులను నియమించుకునే పనిలో పడ్డారు. దీంతో బొల్లినేని వర్గీయులు లోలోన ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న కొందరు తమను తొలగించినా, తాము సూచించిన వారిని నియమించాలని కోరుతున్నారు. అయినా ఎమ్మెల్యే అవేమి పట్టించుకోకుండా తనకు అనుకూలమైన వారినే ఎంపిక చేసుకుంటున్నారు. భవిష్యత్‌లో తాను చెప్పిన విధంగా నడుచుకునే నాయకత్వాన్ని తయారు చేసుకుంటున్నారు. బొల్లినేని వర్గీయులను పూర్తిగా పక్కగా పెట్టి ఆయన ముద్రను పూర్తిగా చెరిపివేసే విధంగా అడుగులు వేస్తున్నారు. దీంతో బొల్లినేని వర్గీయులు ఏమి చేయలేని స్థితిలో గుమ్మనంగా ఉన్నారు. భవిష్యత్తులో దెబ్బతీసేందుకు కాచుకుని ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

మండల కమిటీలపై ముద్ర

ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మండల పార్టీ కమిటీలపై తన ముద్ర పూర్తిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. స్వయంగా గ్రామస్థాయిలో పర్యటిస్తూ గ్రామ కమిటీలను ఎంపిక చేస్తున్నారు. భవిష్యత్తులో గ్రామస్థాయిలో కూడా తన క్యాడర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మండలాధ్యక్షుల నిమాయకంపైన కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల పార్టీ అధ్యక్షుల జాబితాను కూడా తయారు చేసినట్లుగా సమాచారం. కొండాపురం మండలానికి మాజీ జెడ్పీటీసీ దామ మహేశ్ సూచించిన పీ చంద్రబాబునాయుడు పేరును ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. కలిగిరి మండలానికి కమ్మ సామాజిక వర్గానికి చెందిన పూసాల వెంగప నాయుడు పేరు దాదాపు ఖరారు అయినట్లుగా సమాచారం. వింజమూరు మండలానికి వనిపెంట సుబ్బారెడ్డి పేరును దాదాపు ఖరారు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. గూడ నరసారెడ్డి, యన్నం రామచంద్రరెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లుగా సమాచారం. దుత్తలూరు మండలం నుంచి ఉండేల గరువారెడ్డి, సీతారామపురం నుంచి చింతల శ్రీనివాస్ పేరు ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. వరికుంటపాడు మండలం నుంచి సొసైటీ మాజీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం పేరు వినిపిస్తోంది. అయితే ఎమ్మెల్యే పలువురు పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లుగా సమాచారం. ఉదయగిరి మండలం నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎంపిక చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ బాధ్యతను పార్టీ సీనియర్ లీడర్ మన్నేటి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే అప్పగించినట్లు సమాచారం.అయితే ప్రస్తుతానికి బొజ్జ నరసింహులు, జి.చెర్లోపల్లికి చెందిన మతకాల శ్రీనివాసులు పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమచారం . కడపలో టీడీపీ మహానాడు జరిగే నాటికి మండల కమిటీల నియామకాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

అటునా.. ఇటునా.. ఎటెళ్లాలో!



కావలికి కూడా నెల్లూరు వైపే వెళ్లాలని చూపిస్తున్న సూచిక బోర్డు

దగదర్తి మండలం ఉలవపాళ్ల వద్ద జాతీయ రహదారి సర్వీసురోడ్డులోని సూచిక బోర్డు వాహనదారులను అయోమయంలో పడేస్తోంది. జాతీయ రహదారిపై కొత్తగా ప్రయాణించే వాహనచోదకులు సూచికబోర్డులను గమనిస్తూ ముందుకు సాగుతుంటారు. అయితే హైవే అధికారులు ఉలవపాళ్ల వద్ద ఏర్పాటు చేసిన సూచికబోర్డులో కావలికి సైతం నెల్లూరు వైపుగా వెళ్లాలని సూచిస్తూ యారోమార్కు ఇవ్వడంతో వాహనచోదకులు తికమక పడుతున్నారు. వాహనాలను నిలిపి కావలికి ఎటెళ్లాలని స్థానికులను అడిగి తెలుసుకుని వెళ్లాల్సి వస్తోంది. బోర్డులో సూచికలు తప్పుగా ఉన్నాయని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి సూచికబోర్డును మార్చాలని కోరుతున్నారు. – దగదర్తి

హనుమాన్ శోభాయాత్రకు సమాయత్తం

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్ర నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ యువత శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచారు. అనంతరం హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి బైపాస్‌రోడ్డులోని రవితేజ కల్యాణ మండపం వద్ద నుంచి మోటార్‌సైకిళ్లపై సన్నాహక ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రవితేజ కల్యాణ మండపం వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. పట్టణంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం యాత్ర సాగుతుందన్నారు. రాత్రి భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో దేవతల వేషధారణలు, భారీ హనుమంతుని విగ్రహం, సీతారామలక్ష్మణుల అలంకరణలు, మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని వివరించారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌పేట సెక్టార్ సూపర్‌వైజర్ పీ విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందిస్తుందని, సమానత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసించాలని, అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అంగన్‌వాడీలు కే విజయలక్ష్మి, పీ సావిత్రి, ఎం సుశీలమ్మ, పీ షాకీరాబేగం, ఇందిర, కే కృష్ణకుమారి పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై తిరంగా యాత్ర



చేజర్ల(ఆత్మకూరు): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను సైనికులు విజయవంతం చేయడంపై చేజర్లలో శుక్రవారం తిరంగా యాత్ర చేపట్టారు. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు జాతీయ జెండాలు చేతబట్టి యాత్రలో పాల్గొన్నారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించే త్రివిధ దళాల సైన్యానికి దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని, దేశ రక్షణ కోసం ప్రతిఒక్కరూ ఐక్యమవ్వాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు వీ కేశవచౌదరి, కే ఆంజనేయరెడ్డి, నలిశెట్టి శ్రీధర్, లక్ష్మీనరసారెడ్డి, వీరరాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు ఆధార్ తప్పనిసరి

మర్రిపాడు: మండలంలోని గిరిజనుల పిల్లలకు ఆధార్ నమోదు కోసం ఈ నెల 26 నుంచి 31 తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న గిరిజన పిల్లలను గుర్తించి ఆధార్ సెంటర్‌కు తీసుకెళ్లి ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడిగా చంద్రారెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడిగా తుమ్మల చంద్రారెడ్డిని పార్టీ శుక్రవారం ప్రకటించింది. ఆయన గతంలో పార్టీ పట్టణాధ్యక్షుడిగా పనిచేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

కావలి (జలదంకి): కావలి మండలం మొర్లవారిపాళెం సమీపంలో పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై కావలి రూరల్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు సూచనలతో ఎస్సై బాలకృష్ణ తన సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గురు పందెంరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి ఒక కోడి పుంజు, రూ.1580 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన వీరాంజనేయస్వామి ఉత్సవాలు

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో మూడ్రోజులుగా జరుగుతున్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు వీరాంజనేయస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శ్రీశైలం బస్సు సర్వీసుల వేళల్లో మార్పు



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల వేళల్లో స్వల్పమార్పులు చేస్తూ శుక్రవారం పునఃప్రారంభించినట్లు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ఆత్మకూరులో బస్సు బయలుదేరుతుందని చెప్పారు. వింజమూరు, పామూరు, కనిగిరి పొదిలి, మార్కాపురం, దోర్నాల మీదుగా మధ్యాహ్నం 2 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరే బస్సు అదేరోజు రాత్రి ఒంటి గంటకు ఆత్మకూరుకు చేరుకుంటుందని వివరించారు. టిక్కెట్ ధర రూ.440గా నిర్ణయించామని తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలిగిరి: గ్రామీణ ప్రాంత రైతులు ఉద్యాన పంటల సాగులో ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి అన్నారు. అనంతపురం, కావలిముస్తాపురం, వెలగపాడు, తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలు, పూలతోటలు సాగు, భూమి అభివృద్ధి పనులకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సన్నకారు సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, జాబ్ కార్డు, 1బీ, అడంగల్ పత్రాలతో గ్రామసచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కావలిముస్తాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

విద్యావనరుల కేంద్రానికి చేరిన స్టూడెంట్ కిట్లు

సోమశిల: అనంతసాగరం మండల విద్యావనరుల కేంద్రానికి సర్వపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లు శుక్రవారం వచ్చినట్లు ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సంబంధించి 3,497 కిట్లు వచ్చాయని చెప్పారు. వాటిని పాఠశాలలకు పంపిణీ చేసి తెరిచిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.



భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం వేకువజామున అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. భక్తులు వేకువజామునే తలస్నానాలు చేసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రదక్షణలు చేసిన అనంతరం భజనగీతాలు ఆలపిస్తూ అగ్నిగుండంలో నడిచారు. వేలాది సంఖ్యలో భక్తులు అగ్నిగుండ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం సంప్రదాయం మేరకు అర్చకులు వేదమంత్రాల నడుమ అగ్నిగుండంలో పాలుపోసి తెల్లటి వస్త్రాన్ని పరిచి మట్టితో కప్పివేశారు. అనంతరం ఆంజనేయస్వామి మూలవిరాట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

వివాదాస్పద భూమి పరిశీలన

ఉదయగిరి రూరల్: మండలంలోని గన్నేపల్లి రెవెన్యూ పరిధిలోని జెట్టివారిపల్లిలోని సర్వే నంబర్ 42/2లోని 4.14 ఎకరాల వివాదాస్పద భూమిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఆర్డీఓ పావని శుక్రవారం పరిశీలించారు. భూమితో పాటు భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఇరువర్గాలతో వారితో మాట్లాడారు. భూముల సాగుపై గ్రామస్తులను సైతం విచారించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సుభద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జహీర్, వీఆర్వో అంజాద్, సర్వేయర్ రవీంద్ర, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నిర్వహణ భారం..ఆశయానికి దూరం



సత్యవోలులో సంపద కేంద్రాన్ని ఆక్రమించిన కంపచెట్లు



పార్లపల్లిలో నిరుపయోగంగా సంపద కేంద్రం

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

కొండాపురం : మండలంలోని పలు పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు కీలకం. అయితే వాటి నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఫలితంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలి. తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలి. తద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల నిర్వహణకు వినియోగించుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. అయితే వర్మికంపోస్టు తయారీకి ఖర్చు ఎక్కువగా అవుతోంది. దీంతో ఎరువు తయారు చేసినా అధిక ధరకు కొనేందుకు రైతులు ముందుకు రావడం లేదు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. ప్రభుత్వ నిబంధనల మేరకు కేంద్రాలను నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుంది. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, సంపద కేంద్రాలకు తరలింపు, వర్మికంపోస్టు తయారీపై పంచాయతీలు దృష్టి సారించాలి.

– ఆదినారాయణ, ఎంపీడీఓ, కొండాపురం

ప్రత్యేక నిధులు అవసరం

చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక నిధులు అవసరం. నిధుల కొరత ఉన్న పంచాయితీల్లో నిర్వహణ సాధ్యం కాదు. పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వడం, నిధులు మంజూరు చేయడం చేస్తేనే నిర్వహణ సాధ్యమవుతుంది.

–మహబూబ్ మున్నీసా, సర్పంచ్, రేణమాల పంచాయతీ

పచ్చదన పరవశం



ఆత్మకూరు మండలం నాగులపాడు రోడ్డులో పచ్చదనం పరిఢవిల్లుతోంది. ఈ మార్గంలో ఆత్మకూరు మండలంతో పాటు మర్రిపాడు, అనంతసాగరం మండలాలకు చెందిన ప్రజలు ఆత్మకూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో నాగులపాడు–రావులకొల్లు మధ్యన నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా నాటిని మొక్కలు బాగా పెరిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. ఆ మార్గాన ప్రయాణించే వారిని పరవశింపచేస్తూ సేదతీరుస్తున్నాయి. – ఆత్మకూరురూరల్